‘గత ప్రభుత్వంలో రుణమాఫీ ఆలస్యం’

బాన్సువాడ, న్యూస్‌టుడే : గత ప్రభుత్వంలో ఆర్థిక ఇబ్బందులతో రైతు రుణమాఫీ కొంత ఆలస్యమైందని, ప్రస్తుతం అదే పరిస్థితి ఉన్నా కాంగ్రెస్ సర్కారు రూ.2 లక్షలు మాఫీ చేసిందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇప్పటికే రూ.18 వేల కోట్లు మాఫీ అయిందన్నారు. ప్రజలందరూ సన్న బియ్యానికి అలవాటు పడ్డారని, అందుకే సన్న బియ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం బోనస్ ఇస్తుందని తెలిపారు. కేంద్రాల్లో సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులందరికీ న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, ఖాలెక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంలోకి సోమవారం సాయంత్రానికి 8000 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో రెండు ప్రధాన వరద గేట్ల ద్వారా 7000 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి, వెయ్యి క్యూసెక్కులు ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు ఏఈఈ శివప్రసాద్ చెప్పారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1405 అడుగులు ఉంది.

పావు ఎకరం.. ₹ 10వేల ఆదాయం



వివరాలు 6 లో...

పాఠశాల విద్య గాడిన పడేనా..

ఉపాధ్యాయులు, ఎంఈవోల నియామకంతో చిగురించిన ఆశలు

ఈనాడు, కామారెడ్డి

పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. బోధనలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు పాఠశాల సముదాయం, మండలం పరిధిగా నోడల్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. వీటితో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది. దీంతో సర్కారు పాఠశాలల్లో గాడితప్పిన విద్యాబోధన బాగుపడుతుందని పిల్లల తల్లిదండ్రుల్లో ఆశలు చిగురించాయి.

పర్యవేక్షణ లేకపోవడంతో..

మండలానికో ఎంఈవో లేకపోవడంతో ఉపాధ్యాయుల హాజరు, విద్యాప్రగతి, సమయ పాలనను పర్యవేక్షించే వ్యవస్థ లేకుండా పోయింది. భిక్కనూరు మండల పరిధిలోని ఓ తండాకు చెందిన ప్రాథమిక పాఠశాలలోని ఓ ఉపాధ్యాయురాలు వాలంటీర్‌ను నియమించి బోధన కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా కొంతమంది ఉపాధ్యాయులు ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమవుతూ బోధనను అటకెక్కిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యవేక్షణ కొరవడి సిలబస్ పూర్తికాని పరిస్థితి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలు ఉన్నత పాఠశాలల్లో హిందీ పాఠ్యాంశం బోధించే ఉపాధ్యాయులు లేకపోవడం గమనార్హం. విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయుల కొరత, పిల్లలు లేనిచోట అధికంగా ఉన్నారు. సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించినప్పటికీ జిల్లాలో మాత్రం అమలుకు నోచుకోలేదు. జిల్లాల పునర్విభజన అనంతరం అప్పటి ప్రభుత్వం ఉపవిద్యాధికారుల వ్యవస్థను రద్దు చేయడంతో జిల్లాలో విద్యాబోధన పర్యవేక్షించే వారే లేకుండా పోయారు.


తరగతి గదిలో విద్యార్థులు

బాధ్యతల అప్పగింత...

ప్రస్తుతం మండలానికో ఇన్‌ఛార్జి ఎంఈవోను ప్రభుత్వం నియమించింది. బోధనలో నాణ్యత పెంచేందుకు మండలస్థాయిలో సీనియర్ ప్రధానోపాధ్యాయుడిని నోడల్ అధికారిగా నియామకం చేసింది. పాఠశాల సముదాయం పరిధిలో అవసరమైన కార్యాచరణ రూపొందించాల్సిన బాధ్యతను నిర్దేశిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి బదాలయించింది. వీరందరూ నిర్దేశించిన విధులు నిర్వహిస్తున్నారా లేదా అని పర్యవేక్షించాల్సిన బాధ్యతను డీఈవోతో పాటు సెక్టోరియల్ అధికారులకు అప్పగించింది.

తుది దశకు ఖాళీల భర్తీ..

జిల్లాలో 506 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుండగా.. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల ద్వారా 444 పోస్టులు భర్తీచేసే ప్రక్రియ తుదిదశకు చేరింది. నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు ప్రక్రియ ఒకటి రెండు రోజుల్లో పూర్తిచేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా సరిహద్దు ప్రాంతాలైన జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పాఠశాలల్లోని ఖాళీలను మొదట భర్తీచేయాలని నిర్ణయించారు. తదనంతరం జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాల్లో పూరించనున్నారు.

అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం

ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇన్‌ఛార్జి ఎంఈవోలను నియమించింది. సర్కారు బడుల్లో బోధన ప్రమాణాలు పెంపొందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. **- రాజు, డీఈవో, కామారెడ్డి**

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి : పాలనాధికారి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలని పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిన్నింగ్ మిల్లుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవంబరు మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. క్వింటా పత్తికి సీసీఐ కనీస మద్దతు ధర రూ.7,521 నిర్ణయించిందని తెలిపారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం జిల్లాలో 2.36 లక్షల క్వింటాళ్ల పత్తి సేకరణకు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.7500లకు పైగా ధర చెల్లిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. మిల్లుల వద్ద అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం ప్రచార గోడప్రతులు ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారిణి రమ్య, డీఏవో తిరుమల ప్రసాద్, సీసీఐ బాధ్యులు ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

మద్నూర్, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం మద్నూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆరుగాలం కష్టపడి పండించిన సోయా పంటను రైతులు కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలన్నారు. వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.


మద్నూర్‌లో సోయా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సరిపోని పది పడకలు

జిల్లా బోధనాసుపత్రిలో ఐసీయూ సేవలు అంతంతే

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీయూ విభాగం సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రి నుంచి జిల్లా ఆసుపత్రిగా మారినా పరిస్థితిలో మార్పురాలేదు. గతేడాది నుంచి కామారెడ్డి బోధనాసుపత్రిగా ఏర్పాటైంది. వంద పడకల స్థాయి కాస్త 330కి చేరింది. నిత్యం ఓపీ, ఐపీ బాగా పెరిగినా సేవలు మాత్రం మెరుగుపడటం లేదు.


కామారెడ్డి ఆసుపత్రిలో ఐసీయూ విభాగం

30 నుంచి 50 పెంచితే మేలు..

ప్రస్తుతం రోగుల తాకిడి దృష్ట్యా 30 నుంచి 50 పడకల ఐసీయూ ఏర్పాటైతేనే లబ్ధి జరగనుంది. నిత్యం ఐసీయూ విభాగానికి 30 నుంచి 40 కేసులు వస్తున్నాయి. కామారెడ్డి పరిసర ప్రాంతాలైన దోమకొండ, మాచారెడ్డి, భిక్కనూరు, రాజంపేట, ఎల్లారెడ్డి నుంచి అత్యధిక కేసులు చికిత్స నిమిత్తం రాగా అందులో అత్యవసరం అనుకున్నవారిని ఐసీయూ విభాగానికి సిఫారసు చేస్తున్నారు. పాము, కుక్క కాటు కేసులకు ప్రాథమిక వైద్యం వరకే ఇక్కడ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కుక్క కాటు బారిన పడిన ఓ వృద్ధురాలిని హైదరాబాద్‌కు సిఫారసు చేశారు. అనేక కేసులు నిజామాబాద్, హైదరాబాద్‌కు పంపడంతో రోగులకు భారం తప్పడం లేదు.

విస్తరణపై దృష్టి పెడితేనే..

కామారెడ్డి బోధనాసుపత్రిలో గతేడాది పైన షెడ్లు నిర్మించారు. ఇందులో 100 పడకల వరకు ఏర్పాటు చేశారు. ఇక ట్రామాకేర్, పిల్లల ఐసీయూ, ప్రసవ విభాగం, పాలియేటివ్ కేర్ యూనిట్, టీకాలు, ఐసీయూ, డయాలసిస్, రక్తనిధి కేంద్రం, ఆర్టీపీసీఆర్ ప్రయోగశాల, గాయాలపాలైనవారికి చికిత్స అందించే వార్డు ఇలా అన్ని ఒకే ఆసుపత్రిలో ఇరుకిరుకుగా ఉన్నాయి. ప్రస్తుతం ఆయుష్ ఆసుపత్రి ఇక్కడే ఉంది. ఇందులో నుంచి పలు విభాగాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఐసీయూ విభాగాన్ని విస్తరించే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయమై ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డా.రాంసింగ్ స్పందిస్తూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చోటనే వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదనపు పడకల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నేడు

నియామకపత్రాలు అందుకున్నవారు హాజరుకావాలని ఆదేశాలు

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

ప్రభుత్వ బడుల్లో కొత్త ఉపాధ్యాయులు త్వరలోనే విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే 1:1 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందుకున్నారు. వీరికి మంగళవారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. నిర్దేశించిన సమయాల్లో అభ్యర్థులు హాజరుకావాలని అధికారులు సూచించారు. లేదంటే వారి స్థానంలో తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యేవారు నియామక పత్రాలతోపాటు మూడు ఫొటోలు తీసుకురావాలని, సమగ్ర వివరాలను సమర్పించాలని డీఈవో రాజు పేర్కొన్నారు. వాటిని పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయనున్నారు.

త్వరలో వెబ్ ఆప్షన్లు..

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్కూల్ అసిస్టెంట్లు (అన్ని మాధ్యమాల్లోని సబ్జెక్టులకు సంబంధించి), ఫిజికల్ డైరెక్టర్లు, భాషా పండితులు, పీఈటీలు హాజరవ్వాలని, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్జీటీ తెలుగు, ఉర్దూ, మరాఠీ, ప్రత్యేక విద్య పోస్టుల్లో ఎంపికైన వారి వివరాలు పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం వెబ్ ఆప్షన్లు నిర్వహించనున్నారు.

ఖాతాల్లోకి కూలి డబ్బులు

జిల్లాలో జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తి

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే కూలి డబ్బులు చెల్లిస్తామని కేంద్రం రెండేళ్ల క్రితమే ప్రకటించింది. ఇందుకు జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాల్సిందిగా పేర్కొంది. ఈ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పలుమార్లు గడువు పొడిగించింది. జిల్లా అధికారులు మాత్రం జాబ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం విడతల వారీగా విజయవంతంగా పూర్తి చేస్తూ రావడంతో ఈ ప్రక్రియ ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 2.62 లక్షల జాబ్‌కార్డులు, 3,11,832 మంది క్రియాశీలక ఉపాధి కూలీలు ఉండగా.. శతశాతం ఆధార్ అనుసంధానం పూర్తి చేయడంతో కూలి డబ్బులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి వస్తున్నాయి.

కూలీలకు లబ్ధి..

ఇదివరకు కూలి డబ్బులను స్థానిక తపాలాశాఖ కేంద్రాల నుంచి పంపిణీ చేస్తూ వచ్చారు. కూలీల వేలిముద్రలు తీసుకొని నగదు ఇచ్చేవారు. జిల్లాలోని కొన్నిచోట్ల కూలీలకు తెలియకుండానే డబ్బులు మాయం చేసిన ఘటనలు వెలుగుచూశాయి. వేలిముద్ర వేయగానే నగదు ఉపసంహరించుకొని.. డబ్బులు రాలేదని చెప్పిన వ్యక్తులు కూడా ఉన్నారు. ఇలా జిల్లాలో అక్రమాలకు పాల్పడిన పలువురిపై కేసులు నమోదయ్యాయి. మరికొన్నిచోట్ల చిల్లర డబ్బులు లేవని పైమొత్తం దోచుకునేవారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయడానికి బ్యాంకు ఖాతా విధానం ఎంతగానో ఉపకరిస్తుంది. కూలీలను మోసం చేసే అవకాశం ఉండదు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపసంహరణ సులువు

గతంలో కూలీలకు డబ్బులు రాగానే తపాలాశాఖ కార్యాలయాల ఎదుట బారులు తీరేవారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వరసలో నిలబడితే గాని డబ్బులు తీసుకోలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ విధానం తొలగించి బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లింపుల విధానాన్ని అమలు చేయడంతో నగదు ఉపసంహరణ సులువైంది. కొన్నిచోట్ల లావాదేవీల నిర్వహణ లేని బ్యాంకు ఖాతాల్లో కూలి డబ్బులు జమవుతున్నాయి. ఈ విషయాన్ని క్షేత్ర సహాయకుల ద్వారా తెలుసుకుని ఖాతాలను తిరిగి క్రియాశీలకంగా మార్చుకుంటున్నారు. డబ్బులు ఖాతాల్లో పడితే సంక్షిప్త సమాచారం ద్వారా తెలుసుకుంటున్నారు.



ఈ చిత్రంలోని వానర దండు మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలోని అభయాంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల ప్రాంగణంలో సోమవారం రాత్రి కనిపించింది. కోతుల బెడద తీవ్రంగా ఉందని, తరచూ దాడి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీటి బెడదను నివారించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్, మాచారెడ్డి

మదినిండా మధుర జ్ఞాపకాలు




తాడ్వాయి మండల కేంద్రంలో దాదాపు వెయ్యి మంది వరకు యువత, ఇతరులు విద్య, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, ఇతర పట్టణాలకు వెళ్తుంటారు. దసరాకు వచ్చి వారం పాటు సందడి చేశారు. సెలవులు ముగియడంతో వెనుదిరుగుతున్నారు. మళ్లీ వీరంతా సంక్రాంతికి వచ్చి తాడ్వాయి ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. దాదాపు 200 మంది సభ్యులు జట్లుగా విడిపోయి పోటీ పడతారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎండ్రియాల్‌లో దాదాపు 500 మంది విద్యార్థులు, యువత వారంపాటు గ్రామంలో సందడి చేశారు. ఇప్పుడు మళ్లీ తమ రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యేందుకు తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ రెండు గ్రామాలే కాదు. ఉమ్మడి జిల్లాలో ప్రతి ఊరి నుంచి ప్రజలు మది నిండా దసరా మధుర జ్ఞాపకాలు దాచుకొని వెళ్తున్నారు.

- ముగిసిన దసరా సెలవులు
- పట్టణాల బాట పట్టిన ఉమ్మడి జిల్లా వాసులు

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్, కామారెడ్డి పట్టణం

ఉరుకుల పరుగుల జీవితం. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడితే.. ఉద్యోగులు విధుల్లో తీరిక లేకుండా అలసిపోయారు. బతుకుదెరువుకు వలస వెళ్లి హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో కాయకష్టం చేసుకుంటున్నారు. వీరందరికీ ఈ సారి బతుకమ్మ, దసరా కలిసొచ్చాయి. వారం ముందే సొంతూళ్లకు చేరారు. కుటుంబ సభ్యులతో అనుబంధాలు, ఆనందం పంచుకున్నారు. స్నేహితులతో సందడి చేశారు. మహిళలు బతుకమ్మ ఆడారు. యువకులు ఆటలు ఆడారు. పెద్దలు సరదాగా కబుర్లు చెప్పుకొన్నారు. విందు భోజనాలు చేశారు. అలయ్.. బలయ్ ఇచ్చుకున్నారు. వారం పాటు సరదాగా గడిపి మధుర జ్ఞాపకాలు మిగిల్చుకొని మళ్లీ తమ రోజువారీ దినచర్యలో భాగమయ్యేందుకు తిరుగు ప్రయాణమయ్యారు.



మార్గాలు కిటకిట..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లోనూ బతుకమ్మ, దసరా ఉత్సవాలు అంబరాన్నంటాయి. పండుగల వేళ సందడి చేసిన జిల్లావాసులు ఇక తమ విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం వలస బాట పట్టారు. ఉమ్మడి జిల్లా జనాభాలో 15-20 శాతం మంది వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. వారంతా పండుగకు స్వస్థలాలకు వచ్చారు. వివిధ సమయాల్లో రావడంతో రహదారులు, ప్రయాణ ప్రాంగణాల్లో రద్దీ అంతగా లేకుండే. తిరుగు ప్రయాణంలో అంతా ఒకేసారి వెళ్తుండటంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటకిలాడుతున్నాయి. వ్యక్తిగత రవాణా సాధనాలు పెరగడంతో టోల్‌గేట్ల వద్ద కార్లు బారులుదీరాయి. ఇందల్‌వాయి, భిక్కనూరు టోల్‌ప్లాజాల వద్ద రద్దీ ఎక్కువగా కనిపించింది. హైదరాబాద్‌లో ఇంటర్, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులు చేసేవారు ఎక్కువ. ఉపాధి కోసమైతే వృత్తి నిపుణులు మొదలు, ఇతర చిరు ఉద్యోగాలు సైతం రాజధానిపైనే ఆధారపడుతుంటారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లే కుటుంబాలు సైతం ఎక్కువే.


కామారెడ్డి ప్రయాణ ప్రాంగణంలో రద్దీ...


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కత్తులతో దాడి ముగ్గురికి గాయాలు

సదాశివనగర్ : ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైన ఘటన సదాశివనగర్ మండలం లింగంపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గుండెల్లి చిన్న సాయిలు కుమారులు.. మోహన్, అనిల్‌కు అదే గ్రామానికి చెందిన మరో కుటుంబంతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల అనిల్‌కు మరో వర్గానికి చెందిన వ్యక్తితో గొడవ జరగగా.. గ్రామస్థులు సర్దిచెప్పారు. ఇది మనసులో పెట్టుకొన్న మరో వర్గానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు కలిసి చిన్నసాయిలు ఇంటి మీదకు కత్తులతో వచ్చి అనిల్‌ను గాయపర్చారు. అడ్డుగా వెళ్లిన తండ్రి సాయిలు, అన్న మోహన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సాయిలు పరిస్థితి విషమంగా ఉందన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

ఎంట్రెన్స్ లేకున్నా B.Ed.
ఎంత ర్యాంకైనా - ప్రభుత్వ ఫీజుతో
కొద్ది మేనేజ్‌మెంట్ సీట్స్ - ఫీజు వాయిదాల్లో
JN కాలేజి, వేములవాడ
✆: 92469 32088

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
సమాచారం అందరికీ చేరుతుందిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



నిజామాబాద్: 9000566042, 8008709958, 9963849851, 9963849825,
బోధన్: 9959097634, ఆర్మూర్: 8008553004
కామారెడ్డి : 8008709960, బాన్సువాడ : 8008709959

(c) eenadu

మక్క.. లాభాలు ఎంచక్కా

న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం

వానాకాలం సీజనులో మక్కలు (మొక్కజొన్నలు) ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌కు చెందిన రైతు మూడ అశోక్ ఇంట సిరులు కురిపించాయి. సాగులో సస్య రక్షణ చర్యలు చేపట్టి పెట్టుబడికి మూడు రెట్ల ఆదాయం ఆర్జించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు అశోక్.

మూడెకరాల్లో సాగు..

రైతు అశోక్ ఎకరం వ్యవసాయ భూమిలో పసుపు, వరి 6 ఎకరాలు, 3 ఎకరాల్లో మొక్కజొన్న, కూరగాయలు అర ఎకరంలో పండిస్తున్నారు. అందరికంటే ముందుగా మే మొదటి వారంలోనే జినామిక్స్ 305 రకానికి చెందిన మొక్కజొన్న విత్తనాలు 2 ఎకరాల్లో విత్తుకున్నారు. మే 15న మరో ఎకరంలో సాగు ప్రారంభించారు. దుక్కి దున్నడం, బోజలు వేయడం, కూలీల ఖర్చులకు రూ.5 వేలు ఖర్చుచేశారు. విత్తనాలకు రూ.2 వేలు, సేంద్రియ ఎరువులు, యూరియా, పురుగు మందులకు రూ.13 వేల పెట్టుబడి పెట్టారు. 3 ఎకరాలకు రూ.60 వేలు



మొక్కజొన్న క్షేత్రంలో రైతు అశోక్

ఖర్చయింది. మొదట సాగు చేసిన పంట సెప్టెంబరు రెండో వారంలో, చివరిది సెప్టెంబరు 20న కోతకు వచ్చింది. మొత్తంగా 95 క్వింటాళ్ల 50 కిలోల దిగుబడి రాగా.. రూ.2,32,052 అందాయి. ఖర్చులు పోను రూ.1.72 లక్షల ఆదాయం వచ్చిందని రైతు వివరించారు. పసుపు, వరి, కూరగాయలతో మరింత ఆదాయం పొందుతున్నట్లు చెప్పారు.

శ్రమకు దక్కిన ఫలితం

- మూడ అశోక్, పెర్కిట్

కష్టాన్ని నమ్ముకొని సాగు చేసినందుకు ఇతర పంటలతో పోల్చుకుంటే ఈ ఏడాది మక్కకు మంచి ధర దక్కింది. అధిక దిగుబడి సాధించేందుకు మంచి రకానికి చెందిన విత్తనాలు ఎంచుకోవడం ముఖ్యం. మొక్కజొన్నలకు ప్రతి ఏడాది రైతులకు గిట్టుబాటు ధర ఉండేలా ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వాలి. మొక్కజొన్నలు పండించే ప్రాంతంలో దీని అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ధర నిలకడగా ఉండేలా చూడాలి.

రైతేరాజు

పసుపులో సస్యరక్షణ

న్యూస్‌టుడే, కోటగిరి : పసుపు పంటకు ఆశించే తెగుళ్లలో ప్రధానమైంది దుంప కుళ్లు, దుంప ఈగ. తెగులు వ్యాప్తి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తెగులు లక్షణాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రుద్రూర్ కేవీకే సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డా. విజయ్‌కుమార్ పలు సలహాలు, సూచనలు తెలిపారు.



● **దుంప కుళ్లు:** పంటలో అధికంగా నీరు నిల్వ ఉండటంతో దుంప కుళ్లిపోతుంది. తెగులు సోకిన పంట ఆకులు గోధుమ రంగులోకి మారుతాయి. మొక్కలను పీకినట్లైతే తేలికగా ఊడి వస్తాయి. నివారణకు మొదట పొలంలో నీరు నిల్వ ఉండకుండా కాల్వల ద్వారా బయటకు తీసేసే ఏర్పాటు చేసుకోవాలి. అనంతరం లీటరు నీటికి 2.5గ్రా మెటలాక్సిల్, మాంకోజెబ్ లేదా 3గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను తెగులు సోకిన మొక్కల చుట్టూ మొదలు తడిచేలా పోయాలి. తెగులు ఉద్ధృతి ఎక్కువగా ఉన్నట్లైతే కిలో సైమాక్సిల్, మాంకోజెబ్ పొడి తగినంత యూరియా (10-20కిలోలు) కలుపుకొని పొలం అంతటా చల్లుకొని నివారించుకోవచ్చు.

● **దుంప ఈగ:** దుంప కుళ్లు ఆశించిన సమయంలో వెలువడినటువంటి చెడు వాసనకు దుంప ఈగ ఆకర్షిస్తుంది. ఈగ ఆశించిన మొక్క ఆకు, దాని దగ్గరలో ఉన్న లేత ఆకులు గోధుమ రంగులోకి మారి ఎండిపోతాయి. మొక్కను లాగితే సులభంగా ఊడి వస్తుంది. లక్షణాలు గమనించిన వెంటనే ఎకరాకు 200కిలోల వేప పిండి వేసుకోవాలి. లేదా 10కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలి.

రైతు ప్రశ్న సమాధానం

? పత్తి పంటలో రసం పీల్చు పురుగులైన తామర, పేనుబంక, పచ్చదోమ నివారణ చర్యలు తెలుపగలరు?
- రమేష్, రైతు, మద్నూర్



పత్తి పంటలో రసం పీల్చు పురుగులైన తామర, పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎసిఫెట్ 1.5గ్రా లేదా ఎసిటామిప్రిడ్ 0.2గ్రా లేదా థయోమిథాక్సామ్ 0.2గ్రా లేదా ఫ్లోనికామిడ్ 0.3గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా ఎసిఫెట్, ఇమిడాక్లోప్రిడ్ 2గ్రా లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయాలి.
- డా.బాలాజీనాయక్, వరి, చెరకు పరిశోధన స్థానం అధిపతి, రుద్రూర్
— న్యూస్‌టుడే, కోటగిరి

పావు ఎకరం.. ₹ 10వేల ఆదాయం

● 40 ఏళ్లుగా కూరగాయల సాగు

న్యూస్‌టుడే, ఎడపల్లి

ఎడపల్లి మండలం మంగల్‌పాడ్‌కు చెందిన శశికాంత్ అనే రైతు 10గుంటల భూమిలో బెండకాయ సాగు చేస్తున్నారు. పెట్టుబడి కోసం రూ.3,600 ఖర్చు చేశారు. విత్తనాలు విత్తిన 40రోజుల తర్వాత దిగుబడి మొదలవుతుంది. ఇలా రెండు నెలలకు పైగానే ఉత్పత్తులు పొందొచ్చు. వారానికి రూ.2,500 చొప్పున ప్రతి నెల రూ.10వేల వరకు ఆదాయం పొందుతున్నారు. పండించిన ఉత్పత్తులను స్థానిక అంగళ్లకు తరలించి ప్రత్యక్షంగా విక్రయిస్తుంటారు. గత 40 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నట్లు రైతు తెలిపారు.

వరితో పోలిస్తే మంచి లాభాలు

..శశికాంత్, మంగల్‌పాడ్



వరితో పోలిస్తే కూరగాయల సాగుతో మంచి లాభాలు పొందొచ్చు. రుద్రూరు మండలంలోని ఓ రైతు నుంచి బెండకాయ విత్తనాలు కొనుగోలు చేశా. దీంతో లాభాలతో పాటు దిగుబడి కూడా బాగుంటుంది. ప్రకృతి అనుకూలిస్తే కూరగాయల ద్వారా ప్రతి వారం రూ.10 వేల ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ సాగుతో లాభాలే తప్ప నష్టాలు ఉండవు.



సాగవుతున్న బెండ తోట

జాతీయ రహదారి పొడవునా దొంగతనాలే...

న్యూస్‌టుడే, సదాశివనగర్

కామారెడ్డి జిల్లాలో 44వ నంబరు జాతీయ రహదారి భిక్కనూరు మండలం బస్వాపూర్ నుంచి సదాశివనగర్ మండలం దగ్గి వరకు విస్తరించి ఉంది. ఇది దొంగలకు రాచమార్గంగా మారింది. ఎవరికి అనుమానం రాకుండా తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను పరిశీలించి చోరీలకు పాల్పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ద్విచక్ర వాహనాలను సైతం ఎత్తుకెళ్తున్నారు. ఒంటరి మహిళలు, గోదాములు, తాళం వేసిన గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడి జాతీయ రహదారి గుండా తప్పించుకుంటున్నారు. ఈ మార్గంలో దగ్గి, కల్వరాల్, పద్మాజివాడి క్రాస్‌రోడ్డు, సదాశివనగర్, మర్కల్, కుప్రియాల్, టేక్రియాల్, జంగంపల్లి గ్రామాలు ఉన్నాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ, హైదరాబాద్ వెళ్లేందుకు ప్రధాన రహదారి. రద్దీ విపరీతంగా ఉండటంతో కొత్త వారిని గుర్తించే అవకాశం ఉండదు. వ్యాపారాలు, ప్రజాప్రతినిధుల నుంచి విరాళాలు సేకరించి ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. ఇదే దొంగలకు అనువుగా మారింది.

జరిగిన సంఘటనలు

● గత నెల జాతీయ రహదారి పక్కనున్న ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు పడి కంప్యూటర్లు, బ్యాటరీలను ఎత్తుకెళ్లారు.

● రెండ్రోజుల కిందట సదాశివనగర్‌లో ద్విచక్ర వాహనాన్ని దుండగులు తీసుకెళ్లారు.

● గతేడాది సదాశివనగర్‌లోని గ్యాస్ గోదాంలో దొంగలు పడి సిలిండర్లు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

● గతంలో కుప్రియాల్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో పనిచేసే సిబ్బంది విధులు ముగించుకొని వెళ్తుండగా జాతీయరహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించారు.

● సదాశివనగర్ వైన్స్‌లో దొంగలు పడి డబ్బులు, మద్యం ఎత్తుకెళ్తుండగా సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.

● పద్మాజివాడి క్రాస్‌రోడ్డులో ఓ ఇంట్లో కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగాలేకపోవడంతో తాళం వేసి వెళ్లారు. ఇది గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి భారీమొత్తంలో నగదును దోచుకున్నారు.



పద్మాజివాడి క్రాస్ రోడ్డు

ప్రత్యేక చర్యలు చేపడతాం

- సంతోష్‌కుమార్, సీఐ, సదాశివనగర్



దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. ప్రజలు, వ్యాపారులు వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం తిరుగుతున్నాయి. ప్రజలు ఊళ్లకు వెళ్లేటప్పుడు... తమ ప్రాంతంలో కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వరి ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో 419 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో సేకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులున్నారు.

అత్యవసర సేవలు మెరుగుపర్చాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: అత్యవసర సేవలను మరింత మెరుగుపర్చాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ వాహనాల నిర్వహణ బాధ్యుడు సత్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో 108 అంబులెన్సు వాహనాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పని తీరుపై ఆరా తీశారు. ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సిబ్బంది తిరుపతి, నరేశ్, విజయ్, రాజేశ్ తదితరులున్నారు.



అంబులెన్సులో రికార్డులు పరిశీలిస్తున్న నిర్వహణ బాధ్యుడు సత్యనారాయణ

కలెక్టరేట్‌లో అలయ్ బలయ్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో తొలిసారిగా అలయ్ బలయ్ వేడుకలను టీఎన్జీవోస్, టీజీవో ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడారు. ప్రజలకు ఏడాది పొడవునా విజయాలు దక్కాలని ఆకాంక్షించారు. ఉద్యోగ సంఘాలు అలయ్ బలయ్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జిల్లా అధికారులు కలెక్టర్‌కు జమ్మి ఆకులు(బంగారం) అందజేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్జీవోస్ అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, టీజీవో అధ్యక్షుడు డాక్టర్ దేవేందర్, సాయిరెడ్డి, సాయిలు, డీఆర్‌డీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోవాలి



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు

జుక్కల్, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ హిమబిందు పేర్కొన్నారు. సోమవారం జుక్కల్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో ముద్రించిన గోడప్రతులను ఆమె ఎంపీడీవో శ్రీనివాస్, యూత్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. దరఖాస్తు ప్రక్రియ, ఆన్‌లైన్ విధానం, ఫారం-18, దరఖాస్తు చివరి తేదీ తదితర వివరాలు గోడప్రతుల్లో ముద్రించారు. సభ్యులు మారుతి, సాయికర్ణ, విఠల్, బాలాజీ, మారుతి, వాగ్మరే లక్ష్మణ్, ఆర్మాన్ తదితరులు ఉన్నారు.

ఎంపీ సురేశ్ షెట్కార్‌కు సన్మానం

కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టుడే: జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మద్ది చంద్రకాంత్‌రెడ్డి సోమవారం సన్మానించారు.



తనకు అవకాశం కల్పించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీ సురేశ్ షెట్కార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బద్ధం ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు భీంరెడ్డి, అంకం రాజు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీలు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

☛ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ

పేదల ఇళ్ల నిర్మాణ పథకానికి ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలో కసరత్తు జరుగుతోంది. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి శనివారం సాయంత్రం వరకు కమిటీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాని శనివారం దసరా పండుగ, మరుసటి రోజు ఆదివారం రావడంతో ప్రక్రియలో ఆలస్యం జరిగింది. మంగళవారం సాయంత్రంలోగా కమిటీలను పూర్తిచేయాలనే సంకల్పంతో అధికారులు పనిచేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో 526 గ్రామపంచాయతీలకు, 80 మున్సిపల్ వార్డులకు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామపంచాయతీలకు, 60 కార్పొరేషన్, 85 మున్సిపాలిటీ వార్డులకు ఇందిరమ్మ కమిటీలు వేయనున్నారు. పేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో ఈ కమిటీలు పనిచేయనున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి సర్కార్ రూ.5 లక్షలు మంజూరు చేయనుంది.

ఉండేది వీరే..

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఏర్పాటు చేయనున్న కమిటీల్లో ఏడుగురికి స్థానం కల్పించారు. గ్రామపంచాయతీల్లో సర్పంచి/ప్రత్యేకాధికారి ఛైర్మన్‌గా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా కొనసాగుతారు. అదే గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలకు సభ్యులుగా అవకాశం కల్పిస్తారు. వేరే కాకుండా ముగ్గురు స్థానికులకు సభ్యులుగా తీసుకుంటారు. ఇందులో బీసీ వర్గాల నుంచి ఒకరికి, దళిత, గిరిజన వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పిస్తారు. అలాగే కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అయితే వార్డుస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. కార్పొరేటర్/కౌన్సిలర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వార్డు అధికారి కన్వీనర్‌గా కొనసాగుతాడు. ఇక్కడ కూడా స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇక స్థానికుల కోటాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పిస్తున్నారు.

అధికార పార్టీ నుంచే ప్రతిపాదనలు..?

ప్రభుత్వం వెల్లడించిన ఉత్తర్వుల్లో కమిటీల ఏర్పాటు ఎవరు చేయాలనేది స్పష్టంగా లేకపోవడంతో చాలా చోట్ల అధికార పార్టీ ప్రతినిధులే సభ్యుల పేర్లకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలనే కమిటీల్లో చోటు కల్పించడానికి ప్రయత్నం జరుగుతోంది. చాలా గ్రామాల్లో ఇప్పటికే కమిటీ సభ్యుల పేర్లను పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ అధికారపార్టీకి చెందిన నేతలే ఇందిరమ్మ కమిటీ సభ్యుల పేర్లను ప్రతిపాదిస్తున్నారు.

మరింత అభివృద్ధి చేస్తా

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: నస్రుల్లాబాద్ మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నస్రుల్లాబాద్‌లో రూ.1.43 కోట్లతో నిర్మించనున్న పీహెచ్‌సీ భవనం, రూ.7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ బావయ్య, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సూర్యకాంత్, వైద్యాధికారి గిరీష్‌కుమార్, శ్రీనివాస్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా అల్లాపూర్ కుషాల్, ప్రధానకార్యదర్శిగా పుట్ట శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సర్వసభ్య సమావేశంలో ఆయా మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ఇతర ప్రతినిధులు హాజరై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదివరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పుల్గం దామోదర్‌రెడ్డి రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికవడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో తాజాగా ప్రత్యేక సమావేశం నిర్వహించి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులను ఎన్నుకొని వారితో ప్రమాణస్వీకారం చేయించారు.



EENADU Classifieds

AGRI BUSINESS

FOR SALE

For Sale: Agriculture Dry Land 2.25 Acre New Collector Office Bypass Arsapally Road, Near Pawar Garden Main Road, Opp: PATC HP Pump, NZB. ✆ : 9848166917.

FINANCIAL SERVICES

TVS క్రెడిట్ సర్వీసెస్ లి.లో యూజ్డ్ కార్స్, రిఫైనాన్స్ & బ్యాలెన్స్ ట్రాన్స్ఫర్ లోన్స్ అతి తక్కువ వడ్డీ రేటులో ఇవ్వబడును. అతి తక్కువ డాక్యుమెంటేషన్. సెల్: 91001 11717, 91001 11716.

JOBS

Wanted : 1). Diploma in Civil 2 Posts, 2). Welder are Helper 5 Posts, Contact: Everest Scale, Nizamabad. ✆ : 9182359067.

Medical Representatives Required urgently. to Work @ Nizamabad. Phone Number: 7032640251 E: cortexlabspvtltd@gmail.com

ప్రముఖ హాస్పిటల్ కొరకు మార్కెటింగ్ మేనేజర్లు, Q: MBA గ్రాడ్యుయేట్లు, హాస్పిటల్ మేనేజర్లు & రిసెప్షనిస్టులు కావలెను. సంప్ర॥. ✆ : 8341350628, 7731004341, 9298255505.

ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు B.Sc. నర్సింగ్ & GNM స్టాఫ్ (Male/Female) కావలెను. సంప్ర॥. ✆ : 9652788327, 08462233444.

ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌లో కంప్యూటర్ ఆపరేటర్స్, ల్యాబ్ టెక్నీషియన్, పేషంట్‌కేర్ కావలెను. Contact. Phone Number: 7993337544.

Indusind Bank నందు కార్ సెక్షన్‌లో కామారెడ్డి, నిజామాబాద్‌లో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, కన్వియన్స్ + ఇన్సెంటివ్. ✆ : 9603087111.

CUSTOMER SERVICE

నందిపేట స్థానికులకు ప్రాధాన్యత, భారత్ పెట్రోల్ పంపులో పనిచేసేందుకు లేడీస్ లేదా జెంట్స్ కావలెను. సంప్ర॥. ఫోన్:- 9666063519.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

To Book Your Classified Advertisements Please Call: ✆ 9000566042 ★ GST వర్తించును.

మంత్రాలు చేస్తున్నాడని దాడి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: మంత్రాలు చేస్తున్నాడని ఆరోపిస్తూ ఒకరిపై కర్రలతో దాడి చేసిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రం శివారులోని అడ్లూర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దేవునిపల్లి ఎస్సై రాజు కథనం ప్రకారం.. అడ్లూర్‌లో నివాసం ఉండే గడ్డమీది నడిపి సాయిలు మంత్రాలు చేస్తున్నాడని ఆరోపిస్తూ రెండు నెలల కిందట కొంతమంది స్థానికులు ఆయనపై దాడి చేశారు. దీంతో భయపడిన బాధితుడు జిల్లా కేంద్రానికి మకాం మార్చాడు. ఈ క్రమంలో నడిపి సాయిలు ఆదివారం తన ఇంట్లోని సామగ్రిని తీసుకెళ్లేందుకు స్వగ్రామానికి వెళ్లారు. ఇది గమనించిన స్థానికులు వెంకొల్ల రాజు, లక్ష్మణ్, స్వామి, గడ్డమీది శేఖర్‌లు కళ్లలో కారం చల్లుతూ.. గ్రామంలోని ఒకరి చావుకు నీవే కారణమంటూ తనపై కర్రలు దాడి చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన సాయిలుని జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



దాడిలో గాయపడిన నడిపి సాయిలు

లింగ నిర్ధారణ కేసులో విచారణ

రాజంపేట, న్యూస్‌టుడే: ఇటీవల లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పట్టుబడిన రాజంపేటకు చెందిన బల్ల రవీందర్ సోదరి అయిన ఆశా కార్యకర్తను విచారించినట్లు ఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి అనురాధ తెలిపారు. లింగ నిర్ధారణ చేయడంలో నిందితుడికి సాయం చేశారని ఆరోపణలు రావడంతో సోమవారం ఆమెను విచారించారు. ఆశా కార్యకర్తగా ఎప్పటి నుంచి పని చేస్తోంది, లింగ నిర్ధారణ పరీక్షలతో సంబంధం వంటి వివరాలపై గ్రామస్థులు, అనంతరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. వెంట వైద్యాధికారి విజయ మహాలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఎదురుగుట్ట ఆలయ పూజారి మృతి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి-నిజామాబాద్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకుడు దారావత్ రాజ్య(70) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. మాచారెడ్డి మండలం మద్రితండాలో నివసించే రాజ్య 1993-94లో ఎదురుగుట్టపై వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయ పూజారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతి చెందడంతో నిజామాబాద్ జిల్లా సిరికొండ, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, రామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి తదితర మండలాల్లోని గిరిజన గ్రామాల్లో విషాదం అలుముకొంది.



రాజ్య

పాఠశాల పరిశీలన

భిక్కనూరు, న్యూస్‌టుడే: బస్వాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో రాజు సోమవారం పరిశీలించారు. ఇటీవల ఆకతాయిలు పాఠశాలలోని భోజనశాల కిటికీ అద్దం ధ్వంసం చేశారని ఫిర్యాదు రావడంతో వివరాలు సేకరించారు. అనంతరం ప్రిన్సిపల్ జయదేవ్‌తో కలిసి భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సంపత్‌కుమార్ పరిశీలన చేసినట్లు ఆయన తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఈవో రాజు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
నిజామాబాద్: 9000566042, 8008709958, 9963849851, 9963849825,
బోధన్: 9959097634, ఆర్మూర్: 8008553004
కామారెడ్డి : 8008709960, బాన్సువాడ : 8008709959
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11479

(c) eenadu

ఈనాడు సినిమాలు

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్
విట్టయాన్ ది హంటర్ 11.00 2.15 6.00 9.15
విశ్వం 11.00 2.00 6.00 9.00

వీ సినిమాస్
దేవర 10.50 2.15 5.50 9.30

ఏషియన్ దర్శన్
మార్టిన్ 11.00 6.00
మా నాన్న సూపర్ హీరో 2.00 9.00
– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



సమస్య: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ఆసుపత్రుల గల్లీలో రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా మారింది. **- దేవేందర్, గాంధీనగర్**

సమాధానం: రోడ్డు బాగుకు కృషి చేస్తాం. గుంతలు పూడ్చేలా చర్యలు చేపడతాం. **- అంజల్‌రెడ్డి, కౌన్సిలర్**

సమస్య: జిల్లా కేంద్రంలోని బడా కసాబ్ గల్లీలో చెత్త పేరుకుపోయింది. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి. **- అన్వర్, బడా కసాబ్‌గల్లీ**



స్పందన: ఫిర్యాదు మేరకు చెత్త తొలగింపునకు సిబ్బందికి ఆదేశాలిచ్చా. పారిశుద్ధ్య స్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయకాలనీలో కోతుల బెడద నెలకొంది. తగిన చర్యలు తీసుకోవాలి. **- శ్రీకాంత్, ఉపాధ్యాయకాలనీ**



సమాధానం: కోతులను పట్టుకోవడానికి అటవీ శాఖ అధికారులకు విన్నవిస్తాం. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: సంగమేశ్వర్‌లో దోమల బెడద తీవ్రంగా ఉంది. **- రవీందర్, సంగమేశ్వర్**

సమాధానం: దోమల నివారణ చర్యలు తీసుకుంటాం. **- వసంత, గ్రామ కార్యదర్శి, సంగమేశ్వర్**

సమస్య : కన్నాపూర్‌తండాకు వెళ్లే రోడ్డు వర్షాలకు కోతకు గురైంది. వాహనాలను పక్కకు దించితే ప్రమాదాలు జరుగుతున్నాయి. **గోవింద్, గ్రామస్థుడు.**

సమాధానం : రోడ్డు పక్కన మొరం పోయిస్తాం. వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **- రవితేజ, ఏఈ.**

సమస్య: చిన్నకొడప్‌గల్ ఎస్సీకాలనీలో నీటిట్యాంకు అపరిశుభ్రంగా మారింది. **- విజయ్, స్థానికుడు**

సమాధానం: ట్యాంకును శుభ్రం చేయిస్తాం. **- కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, చిన్నకొడప్‌గల్.**

సమస్య: పాత బాన్సువాడ శాంతినగర్ కాలనీలో మురుగు కాల్వల వెంట పిచ్చి మొక్కలు పెరిగాయి. **- రవికుమార్, బాన్సువాడ**

పరిష్కారం: ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత పిచ్చి మొక్కలు తొలగింపజేయించారు.

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం, దోమకొండ, పిట్లం, రామారెడ్డి, బాన్సువాడ పట్టణం

అర్జీలు పరిష్కరించండి..

ప్రజావాణికి వినతుల జోరు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కొందరు బాధితులు న్యూస్‌టుడేతో తమ సమస్యల గోడు చెప్పుకున్నారు..



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఇతరుల పేరిట మార్పిడి చేశారు..

- బాలరాజు, భవానీపేట (లింగంపేట)



మా తాతకు 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం రెండెకరాల అసైన్డ్ భూమి కేటాయించింది. దానిని మా నాన్న, ప్రసుతం నేను సాగు చేసుకుంటున్నా. నేను మేస్త్రీ పని చేసుకోవడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాను. పట్టాపాస్ పుస్తకం కూడా వచ్చింది. ఏడాది క్రితం వరకు రైతు బంధు జమ చేశారు. ఇప్పుడు నా భూమిని ఇతరుల పేరిట మార్చారు. ఆన్‌లైన్‌లో మరొకరి పేరు చూపిస్తోంది.

రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

- పోచాగౌడ్, మాల్తుమ్మెద



నా పేరిట పంట రుణం రూ.2.09 లక్షలు ఉంది. దీంతో రూ.9వేలను బ్యాంకులో చెల్లించాను. రశీదులను కూడా వెంట తీసుకువచ్చాను. ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పింది. నాకు వెంటనే రుణమాఫీ అమలు చేయాలి.

ఇల్లు కూలింది.. ఆదుకోండి

- సిద్ధరాములు, రాజంపేట



నేను నివాసం ఉండే ఇల్లు పది రోజుల క్రితం కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాను. ఇల్లు కూలిపోయిందని గ్రామ కార్యదర్శి, తహసీల్దార్‌కు విన్నవించాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. దయజేసి నాకు సహాయం చేయగలరు.

ఫ్లెక్సీ చించివేతపై నిరసన

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు కూడలిలో ఫ్లెక్సీ చించివేతకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవిందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యువకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. యువత రాజకీయాల్లోకి రావడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని, రాజకీయ పార్టీలను గ్రామాభివృద్ధిపై ప్రశ్నిస్తున్నామనే అక్కసుతోనే ఫ్లెక్సీలను చించివేశారని ఆయన తెలిపారు.



భిక్కనూరు కూడలిలో నిరసన తెలుపుతున్న యువకులు

బాధిత కుటుంబానికి పరామర్శ



భిక్కనూరు, న్యూస్‌టుడే: బస్వాపూర్ గ్రామానికి చెందిన గాదె లింగం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ, తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట, న్యూస్‌టుడే: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లవెల్లి అశోక్ అన్నారు. సోమవారం రాజంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధర, సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలన్నారు. డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సమన్వయకర్తగా నియామకం

దోమకొండ, న్యూస్‌టుడే: బీసీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మీడియా, పబ్లిక్ రిలేషన్ కమ్యూనికేషన్స్ సమన్వయకర్తగా దోమకొండకు చెందిన కల్యాణ్ నియమితులయ్యారు. అధ్యక్షుడు నారాయణ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో సమన్వయకర్తగా నియమించినందున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీసీఐ మెంటర్ నరహరి, సుమంత్ పాల్గొన్నారు.



నియామకపత్రం తీసుకుంటున్న కల్యాణ్

ప్రతిభావంతులకు పురస్కారాలు

సదాశివనగర్, న్యూస్‌టుడే : సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామ విద్యార్థులు పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు మార బాల్‌రెడ్డి సోమవారం పురస్కారాలు అందించారు. పదిలో .. నారెడ్డి యశ్వంత్‌రెడ్డి, పైడి శ్రీహర్ష.. ఇంటర్‌లో గరికె వైష్ణవి, నారెడ్డి నరేందర్‌రెడ్డిలకు నగదుతో పాటు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకొని జీవితంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, మదుసూధన్‌రావు భైరవ రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి తదితరులు

పారదర్శకంగా విధులు

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: పేద ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం ఇచ్చే బియ్యం పంపిణీ విషయంలో ఎలాంటి తప్పులకు చోటివ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ దశరథ్ అన్నారు. ఇటీవల నిర్వహించిన రేషన్ డీలర్ల పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన పోచారం తండాకు చెందిన కోల సంతోష్, కాస్లాబాద్ గ్రామానికి చెందిన కుర్లెపు తుకారాంలకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీటీ రవికాంత్, ఆర్ఐ పండరీ, నాయకులు హైమద్, మదన్ తదితరులు ఉన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ దశరథ్



పెద్దబజార్‌లో ఉత్సవ నిర్వాహకులు, పోలీసులు



ఎల్లారెడ్డిలో ...



తాండూరులో అమ్మవారి చీరల వేలం

ప్రశాంతంగా ముగిసిన దుర్గాదేవి నిమజ్జనం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి ప్రారంభమైన దుర్గాదేవి శోభాయాత్ర సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. యాత్రలో నృత్యాలు చేస్తూ యువకులు ముందుకు సాగారు. అమ్మవారికి మహిళలు హారతి పట్టారు. ఉత్సవాల్లో పోలీసులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రం శివారులోని చెరువులో దుర్గా విగ్రహాలను నిమజ్జనం చేశారు.

బాన్సువాడ పట్టణం : బాన్సువాడలో ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైన శోభాయాత్ర సోమవారం ఉదయం వరకు సాగింది. ఊరేగింపుగా తీసుకెళ్లి కల్కిచెరువు, పాత బాన్సువాడ చెరువు, పెద్ద పూలు వంతెన వద్ద నిమజ్జనం చేశారు.



కామారెడ్డి శివారులోని చెరువులో దుర్గాదేవి విగ్రహ నిమజ్జనం

రూ.4।వేలు పలికిన లడ్డూ

గాంధారి: దుర్గాయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూను వేలం పాటలో రూ.41వేలకు రామ్‌దళ్ యూత్ సభ్యులు దక్కించుకున్నారు. సోమవారం గ్రామస్థులకు ప్రసాద వితరణ చేశారు. సభ్యులు సాయి, మహేష్, హరీష్, కృష్ణ, అజయ్, గంగాధర్, కన్ని తదితరులు పాల్గొన్నారు.

చీరను దక్కించుకున్న ముస్లిం యువకుడు

నాగిరెడ్డిపేట,న్యూస్‌టుడే: వివిధ అవతారాలలో అమ్మవారికి అలంకరించిన చీరలను తాండూరు, కిచ్చన్నపేట్ దుర్గా మండలి సభ్యులు సోమవారం వేలం వేశారు. తాండూరులో ముస్లిం యువకుడు రఫీక్ రూ. 21500లకు , కిచ్చన్నపేట్ దుర్గా మండలి వారు నిర్వహించిన వేలంలో ఓ భక్తుడు రూ.50వేలకు అమ్మవారి చీరలను దక్కించుకున్నారు. వేలం ద్వారా రూ.1.80లక్షల వచ్చినట్లు కిచ్చన్నపేట్ దుర్గామండలి సభ్యులు తెలిపారు.



బాన్సువాడలో..



కల్కిచెరువులో నిమజ్జనం...



అడ్లూర్ ఎల్లారెడ్డిలో ..



గాంధారి : రూ.4।వేలకు లడ్డూ దక్కించుకున్న రామ్‌దళ్‌యూత్



ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న భాజపా మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్

వీధి కుక్కలను నియంత్రించండి

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు గాంధీ కూడలిలో సోమవారం వీధి కుక్క దాడిలో గాయపడిన చికెన్ దుకాణం యజమాని ఎండీ ముజాయిద్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం భాజపా మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్ ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలో వీధి కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని పిల్లలను బయటకు పంపాలంటేనే గ్రామస్థులు భయపడతున్నారని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సంగమేశ్వర్(దోమకొండ), న్యూస్‌టుడే: దోమకొండ మండలం సంగమేశ్వర్‌లో పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా నాగభూషణం, ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా రాంచంద్రం, సహాయ కార్యదర్శులుగా నర్సింలు, రామకృష్ణ, స్వామి, కే.నర్సింలు, ప్రచార కార్యదర్శిగా సునీల్ ఎన్నికయ్యారు.

పాఠశాలలోని నీటిశుద్ధి యంత్రం ధ్వంసం

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోని నీటి శుద్ధి యంత్రాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. గది తలుపులు పగలగొట్టి యంత్రాన్ని ధ్వంసం చేశారని పాఠశాల సిబ్బంది భిక్కనూరు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.15 వేలతో దీనిని ఏర్పాటు చేశారని, మంగళవారం ఫిర్యాదు చేయనున్నట్లు ఉపాధ్యాయుడు రాజు తెలిపారు.



వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



మనోజ

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చంద్రాయన్‌పల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ కథనం ప్రకారం.. డిచ్‌పల్లి గ్రామానికి చెందిన వేముల సాయిలు పదేళ్లుగా తల్లిదండ్రులతో కలిసి చంద్రాయన్‌పల్లిలో నివాసముంటున్నారు. ఎనిమిదేళ్ల కిందట కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం దగ్గి గ్రామానికి చెందిన మనోజ(29)తో వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమారులున్నారు. మనోజను భర్త సాయిలు అదనపు కట్నం కోసం వేధించేవాడని, దానిని తట్టుకోలేక ఆమె చంద్రాయన్‌పల్లి శివారులో చెట్టుకు ఉరేసుకుంది. మృతురాలి సోదరుడు మూడెడ్ల సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాజీద్‌నగర్‌లో...

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలం వాజీద్‌నగర్ గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వాజీద్‌నగర్ గ్రామానికి చెందిన యెల్లుట్ల సుమలత (36) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేక పోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయలో సోమవారం దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలం రాఘవపల్లి తండా సమీపంలోని బోధన్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...రామక్కపల్లికి చెందిన జోడు సాయిలు(45) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా.... వాహనం అదుపు తప్పి చనిపోయాడా అనే వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ మహిళ ..

బాన్సువాడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందినట్లు బాన్సువాడ సీఐ అశోక్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. హన్మాజీపేట్‌కు చెందిన దంపతులు జనార్దన్, భాగ్యలక్ష్మిలు ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కొత్తబాది వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో బాన్సువాడ ప్రాంతీయ దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఇద్దరిని నిజామాబాద్ తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన భాగ్యలక్ష్మి (21) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

గాయపడి..

బాన్సువాడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సోమేశ్వర్‌కు చెందిన శంకర్ (43) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బాన్సువాడ సీఐ అశోక్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. శంకర్ ఈ నెల 6న ఉదయం నడుచుకుంటూ పాలకేంద్రానికి వెళ్తుండగా తాడ్కోల్ చౌరస్తా సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్ తరలించారు. ఈ క్రమంలో సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంతకాలంగా ఈయన ఓ స్టోన్ క్రషర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి గుండెపోటుతో ..

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తికి గుండెపోటు వచ్చి మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం పరిధిలోని లక్ష్మాపూర్ చెరువులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముదాం దుర్గయ్య(55) సోమవారం చేపలు పట్టడానికి వెళ్లి గుండెపోటు రావడంతో చెరువులో పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.



రవి

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండ మండలం అంబారీపేటకు చెందిన కుంట రవి(33) ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెళ్లి చేయడం లేదని జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బలవన్మరణం...

లింగంపేట,న్యూస్‌టుడే: మండలంలోని మోతే గ్రామానికి చెందిన గాదం ప్రణీత్(20)కడుపు నొప్పి భరించలేక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై అరుణ్ దర్యాప్తు ప్రారంభించారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీలోని నగదును ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును, బీరువాను ధ్వంసం చేసి చీరలు, ఆభరణాలు దొంగిలించినట్లు చెప్పారు. గత సంవత్సరం ఇదే ఆలయంలో దొంగలు పడి అమ్మవారికి సంబంధించిన బంగారు నగలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.



చిందర వందరగా పడేసిన వస్తువులు

జువ్వాడిలో...

గాంధారి, న్యూస్‌టుడే: జువ్వాడిలో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. జువ్వాడికి చెందిన వడ్ల పండరి పది రోజుల క్రితం దసరా పండగ నిమిత్తం తన అల్లుడి వద్దకు(సంగమేశ్వర్) వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలోని పది తులాల వెండి, ఇత్తడి బిందెలు, చెంబులు, దీపాంతాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అల్లుడు కమ్మరి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మాచారెడ్డి, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పల్వంచ మండల కేంద్రానికి చెందిన నంగునూరు శ్రీనివాస్ 11.10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఓ షెటర్లో అక్రమంగా నిల్వ ఉంచాడు. సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.



బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

అదృశ్యం కేసు నమోదు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మండలం పెద్దరెడ్డి గ్రామానికి చెందిన మాచపోయిన సాయిలు(42) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు. సాయంత్రం వరకు తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



సాయిలు (పాతచిత్రం)

మహిళ ...

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముండే కెంగర్ల నిర్మల(35) ఈ నెల 7వ తేదీన బతుకమ్మకు పూలు తెస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదని ఆమె తండ్రి మల్లయ్య ఫిర్యాదు చేసినట్లు కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



గంగమ్మ వాగు వంతెన వద్ద నిలిచిన వాహనాలు

ధాన్యం లారీ బోల్తా

రామారెడ్డి, న్యూస్‌టుడే: ధాన్యం లారీ బోల్తా పడిన ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం సిరికొండ నుంచి కామారెడ్డి వెళ్తున్న లారీ గంగమ్మ వాగు వంతెన వద్ద బోల్తా పడగా డ్రైవరుకు ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. సర్వీస్ రోడ్డు నామమాత్రంగా ఉండడంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. లారీ బోల్తా పడిన ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయాయి. గంగమ్మవాగు వంతెన పనులను వెంటనే పూర్తి చేసేలా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కుప్పలు ఢీకొని ఇద్దరికి గాయాలు

బీర్కూర్, న్యూస్‌టుడే: కిష్టాపూర్ ప్రధాన రహదారిపై ఆరబెట్టిన ధాన్యం కుప్పలను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆదివారం రాత్రి ఇద్దరికి గాయాలయ్యాయి. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్‌కు చెందిన రాము, అశోక్ ఇద్దరు కలిసి ఆదివారం బాన్సువాడకు వెళ్లారు. రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా కిష్టాపూర్‌లో రోడ్డు మధ్యలో ఆరబెట్టిన ధాన్యం కుప్పలను వీరి వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాము తీవ్రంగా గాయపడగా.. అశోక్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసముండే షాబానా ఇల్లు ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి కాలిపోయింది. బాధిత కుటుంబాన్ని పుర ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, స్థానిక కౌన్సిలర్ వనిత పరామర్శించారు.

(c) eenadu